

యందు ఇష్టం కలిగినవాణ్ని నాకు భర్తగా చేయమని అమ్మను కోరుకుంటాను'' అన్నది.

''సరి సరి! నువ్వు ధీరోదాత్తుణ్ని కోరుకున్నావు. ఇక.. నా మాట కూడా అమ్మవారికి వినిపిస్తాను. వీరిద్దరూ కోరుకున్న గుణాలు కలిగిన ధీరలలితుణ్ని నాకు పతిగా చేయి తల్లీ!'' అని వారుణి చేతులు జోడించింది.

ఆమె మాటలకు మధుమతి హాయిగా నవ్వింది.

''ఏమే వారుణీ! ధీరలలితుడైతే ఎప్పుడూ నిశ్చింతగా ఉంటాడు. భోగాలమీద ఆసక్తి కలిగి.. నిన్నెప్పుడూ ఒళ్లో కూర్చోబెట్టుకుని వినోదిస్తాడు. అంతేనా!?'' అన్నది క్రీగంట చూస్తూ.

వారుణి సిగ్గుపడి నవ్వింది. అంతలోనే..

''చంద్రకళా! నీ మనోరథం కూడా వెల్లడించు. చతుర్విధ నాయక లక్షణాలలో ధీరశాంతుడే మిగిలి పోయాడు పాపం!'' అన్నది.

చంద్రకళ చేతులు జోడించుకుని..

''వేదమాతా! నాకు నాయక లక్షణాలు తెలియదు. వీరు ముగ్గురూ కోరుకున్న గుణాలన్నీ ఉన్న పురుషుణ్నే నా మనోహరుడిగా చేయి'' అని మొక్కుకున్నది.

''అమ్మకచెల్లా! చెలీ.. ఎంత గడుసుదానివి! మా భర్తల కంటే నీ భర్తే ఉత్తముడు కాగలడు. కానివ్వు.. సంతోషమే! ఇంతకూ చెలులారా! మన నాయకులు ఏ లోకాలకు చెందినవారో తేల్చుకోవాలి కదా! దేవతలా, మనుష్యులా.. పన్నగులా?!'' అని ప్రశ్నించింది మధుమతి.

ఆ మాటకు నివ్వెరపోయిన చంద్రకళ..

''అక్కా! మనం దేవతలమై ఉండగా మన భర్తలు మనుషులు, నాగులు ఎలా కాగలరు? అటువంటి ప్రశ్నకు అవకాశమే లేదు కదా!'' అన్నది.

''మనుషుల సామర్థ్యం నీకు సరిగా తెలియదు. దేవతల కన్నా ఎక్కువ ప్రతిష్ఠ కలిగినవారు మనుషులలో అనేకమంది ఉన్నారు. మన ఊర్వశి దేవతలందర్నీ విడిచి పురూరవుని వరించిన కథ నీకు తెలియదా?!'' అని పలికింది మధుమతి.

''కావచ్చు.. కానీ, మానవులు అల్పాయువులు కదా!'' అని సందేహించింది చంద్రకళ.

''దేవసంపర్కం కలిగినప్పుడు మానవులు కూడా దీర్ఘాయువులే అవుతున్నారు'' అన్నది మధుమతి.

''నిజమేననుకో అక్కా! మానవులైతే ఒక పోలికగా ఉంటారు. కానీ, పాములకు చక్కదనం ఏముంటుంది?!'' అని మరో సందేహాన్ని ముందుంచింది వారుణి.

''ఇదా నీ సందేహం!? దీనికి నేనొక చక్కని కథ చెబుతాను. సావకాశంగా ఆలకించండి'' అంటూ మధుమతి ఇలా చెప్పసాగింది.

* * *

మా తండ్రి మహేంద్రుని సారథి పేరు మాతలి. ఆయనకు లేకలేక గుణకేశిని అనే కూతురు పుట్టింది. ఆ బాలికామణి సౌందర్యాన్ని వర్ణించడానికి ఆదిశేషునికైనా శక్యం కాదట. అటువంటి కూతురికి సరైన వరుణ్ని ఎంపిక చేయడం కోసం మాతలి దేవలోకాలన్నీ గాలించాడు. రూప యవ్వన విద్యామద గర్వితులైన దేవతా ప్రముఖులెవరూ ఆయనకు నచ్చలేదు. భార్య సలహాపై భూలోకంలో కూడా మూడుసార్లు పర్యటించి వచ్చాడు. కానీ, ఎక్కడా నచ్చిన వరుడు దొరక్కపోవడంతో విసిగివేసారి ఇంటికి తిరిగి వచ్చాడు. అప్పుడతని భార్య..

''మనోహరా! రత్నంలాంటి పిల్లను చూస్తూ చూస్తూ సామాన్యుడికి కట్టబెట్టలేం. కష్టపడి రెండులోకాలు తిరిగారు కదా.. భోగిస్థానమైన పాతాళానికి కూడా వెళ్లిరండి చూద్దాం'' అన్నది.

సరేనంటూ బయల్దేరిన మాతలికి మార్గమధ్యంలో నారదమహర్షి కనిపించాడు. స్తోత్రపాఠాలు అందుకుని, మహర్షి కొన్ని కుశల ప్రశ్నలు వేశాడు. తరువాత..

'ఎందాకా ప్రయాణం' అని అడిగాడు.

అప్పుడు మాతలి..

''స్వామీ! మాతృ సంప్రదాయాన్ని బట్టి నాకొక ఆడపిల్ల పుట్టింది. ఆమెకు తగిన వరుని కోసం ఎంతవెతికినా స్వర్గ మర్త్య లోకాలలో లభించలేదు. పాతాళమొక్కటి చూడాల్సి ఉంది. నేనెప్పుడూ ఆ లోకాన్ని చూడలేదు. మీరు శ్రమ అనుకోకపోతే నాతో పాటు రాగలరా?! మీకెల్లప్పుడూ కృతజ్ఞుడినై ఉంటాను'' అని ప్రార్థించాడు.

నారదుడు నవ్వి..

''అయ్యో పిచ్చివాడా! ఇంతచిన్న విషయానికి నన్నింతగా స్తుతించాలా? నేనిప్పుడు వరుణలోకానికే పోతున్నాను. నాతో రా'' అని నేరుగా వరుణదేవుని వద్దకు తీసుకుపోయాడు.

వరుణుని కుమారులను చూపించాడు.

''ఇదిగో.. ఇతడు పుష్కరుడు. వరుణుడి పెద్దకొడుకు. ఇతడి భార్య జ్యోత్స్నాకళకు రెండో మహాలక్ష్మి అని పేరు. ఆమె క్షేముని పుత్రిక. అదిగో వారందరూ ఇతని తమ్ముళ్లు. విద్యారూప సంపన్నులు. వీరిలో ఎవరైనా నీకు నచ్చితే చెప్పు'' అని అడిగాడు.

మాతలి అనిష్టంగా తలూపాడు. అంతటితో వరుణదేవుని అనుమతి తీసుకుని వారిద్దరూ ఆ లోకంలో విహరించసాగారు. ఆ లోక విశేషాలన్నిటినీ నారదుడు మాతలికి పరిచయం చేయసాగాడు.

''మాతలీ! ఇది భోగవతీ నగరం. రసాతలంలో ఉన్న ఏడోలోకం. కామధేనువు ఇక్కడే పుట్టింది. అదిగో ఆ చెరువు చూశావా!? దానినే వారుణహ్రదం అంటారు. అందులో సర్వదా అగ్ని ప్రజ్వరిల్లుతూ ఉంటుంది. గాండీవానికి పుట్టినిల్లిదే. అదిగో.. ఆ గొడుగే వరుణచ్ఛత్రము. దీనిపై పడిన వర్షబిందువులు చంద్రకిరణాల్లా ఆహ్లాదాన్ని కలగచేస్తాయి. ఈ ప్రదేశాలలో రాజ్యాలు పోగొట్టుకున్న రాక్షసులు నివసిస్తుంటారు. వేయిపడగల ఆదిశేషుడు ఇక్కడే నిలిచి భూమిని మోస్తున్నాడు. ఇది నాగులకు స్థావరం. స్వభావం చేత రౌద్రులైనా వీరంతా మహాప్రభావవంతులు''

..అని నారదుడు చెబుతున్నంతలో, నాగప్రముఖులందరూ నారద మహర్షి వద్దకు గుంపులు గుంపులుగా వచ్చారు. ఆయనకు నమస్కరించి..

''మహాత్మా! ఈమధ్య మీ దర్శనమే మాకు లభించడం లేదు. అందువల్ల ఇతర లోక విశేషాలేమీ తెలియరావడం లేదు. కొత్త విశేషాలేవైనా చెప్పగలరా?!'' అని ప్రశ్నించారు.

దాంతో నారదుడు వారితో కొంతసేపు ఇష్టాగోష్ఠి జరిపాడు. ఆ తరువాత..

''మహాత్మా! మేం మీ వీణాగానం విని చాలాకాలమైంది. ఒక్కసారి గాయత్రీసామం పాడి మాకు ఆనందం కలగచేయండి'' అని వేడుకున్నారు వాళ్లంతా.

నారదుడు మాతలి వైపునకు తిరిగి..

''నీకోసమే నేనీ కచేరీ చేస్తున్నాను. ఇప్పుడు ఇక్కడికి వచ్చేవారిలో నీకు నచ్చేవారెవరో చూసుకో'' అంటూ వీణాగానం ప్రారంభించాడు.

ఆ గానాన్ని వింటూ ఒకచోట నిలువలేక నారదుడి చుట్టూ తిరుగుతూ, శిరస్సులు ఊపుతూ నాగులందరూ పరవశిస్తున్నారు. వారినందరినీ జాగ్రత్తగా పరిశీలించిన మాతలి.. సుముఖుడు అనే నాగకుమారుణ్ని ఎంపిక చేసుకున్నాడు. కచేరీ తరువాత నారదుడు, మాతలి కలిసి ఆర్యకుని ఇంటికి వెళ్లారు.

''ఆర్యకా! ఇతని పేరు నువ్వు వినే ఉంటావు. మాతలి అంటారు. మహేంద్రులవారికి సారథి.. మిత్రుడు, మంత్రి, ప్రాణంలో ప్రాణం అని చెప్పవచ్చు. ఇటువంటి తేజస్వి ఎక్కడా లభించడు. యుద్ధయాత్రలలో వేయిగుర్రాలు పూన్చిన ఇంద్రుని రథాన్ని ఇతడు కేవలం మనస్సుతో నడుపుతుంటాడు. ఇతడు గుర్రాల చేత జయించిన శత్రువులనే మహేంద్రుడు తన చేతులతో నిర్జిస్తాడు. స్వర్గ వైభవమంతా ఇతనిదే అని చెప్పవచ్చు. ఇతనికి అతిలోకసుందరి అయిన గుణకేశిని అనే కుమార్తె ఉంది. ఆమెకు వరుణ్ని అన్వేషిస్తూ ఇప్పుడు ఇక్కడికి వచ్చాం. మీ కుటుంబంతో వియ్యమందాలని కోరిక'' అన్నాడు నారదమహర్షి.

అందుకు ఆర్యకుడు..

''మునీంద్రా! త్రిలోకాధిపతి అయిన మహేంద్రుని మంత్రియే వచ్చి పిల్లనిస్తామంటే కాదనే మూర్ఖుడు ఉంటాడా?! కానీ నాకా అదృష్టం లేదు. కొడుకును పోగొట్టుకుని నెలరోజులు కూడా కాలేదు. మరొక్క పది రోజుల్లో మనుమణ్ని కూడా పోగొట్టుకోబోతున్నాను. ఈ కడుపుకోతను భరించడం నావల్ల కావడం లేదు. ఇలాంటి సమయంలో మీరు పెళ్లిసంబంధం అంటూ వస్తే నేనేం చెప్పగలను'' అంటూ గోలుగోలున ఏడవసాగాడు. అతణ్ని ఊరడించలేక నారదుడు, మాతలి తబ్బిబ్బయ్యారు.

* * *

..మధుమతి చెబుతున్న కథను మిగిలిన ముగ్గురూ ఆసక్తిగా వింటున్నారు. కొద్దిదూరంలో ఒక స్తంభం మాటునుంచి విక్రముడు.. ఆ తరువాత ఏం జరగబోతున్నదో అని చెవులు రిక్కించి మరీ వింటున్నాడు. ■

**(వచ్చేవారం..**
**వరించిన అదృష్టం)**